రైతు నడ్డివిరుస్తున్న కూటమి

- యూరియా అందక రైతన్న రోడ్డు పాలు
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- 'అన్నదాత పోరుబాట' లో మాజీ ఎమ్మెల్యే వైవీఆర్




గుంతకల్లులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, అన్నదాత పోరు ర్యాలీలో పాల్గొన్న రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

గుంతకల్లు: దేశానికే వెన్నెముక..రైతే రాజు అని చెప్పుకునే అన్నదాతల పరిస్థితి దారుణంగా తయారైంది. ఏ రాష్ట్రంలో లేనివిధంగా కూటమి ప్రభుత్వం అన్నదాత నడ్డి విరిస్తోందని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాత పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమానికి వైవీఆర్ అధ్యక్షత వహించగా గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గంలోని రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా వై.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి అనేక హామీలిచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక హామీల అమలుపై శ్రద్ధ వహించకుండా కేవలం కక్ష పూరిత రాజకీయాలకు తెరలేపారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గుత్తిలో సోలార్ హబ్ తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సోలార్ హబ్ కోసం రైతులను బలవంత పెట్టకుండా భూసేకరణ చేశామని గుర్తుచేశారు. అయితే నేడు గుత్తి మండలం బేతాపల్లిలో రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేస్తున్నారన్నారు. ఈ విషయమై సీపీఎం రైతు సంఘ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి బేతాపల్లి గ్రామాన్ని సందర్శిస్తే ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నానాబూతులు తిట్టడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. రైతులు, రైతు నాయకులను గౌరవించడం తెలియదా అంటూ మండిపడ్డారు. ఇక రాష్ట్రంలోని రైతులకు సకాలంలో యూరియా అందంచలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉండటం సిగ్గు చేటున్నారు. బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ రైతులను రోడ్డుపాలు చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, ఉల్లి, మిరప, పత్తి, పొగాకు, మామిడి తదితర పంటలకు ప్రభుత్వం గిట్టుధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. దీంతో జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు జరుగుతున్న అన్యాయలపై ప్రభుత్వాన్ని నిలదీయడంతోనే దిగి వచ్చి గిట్టుధర అందించిన విషయాన్ని గుర్తుచేశారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర అనంతరం తల్లివందనం, రైతు భరోసా, ఫ్రీ బస్సు తమ పోరాటాలు ఫలితంగానే ప్రజలకు అరకొరగా ఇచ్చి దులుపుకున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగి వచ్చి యూరియా కొరత లేకుండా చూడలన్నారు. అంతే కాకుండా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం మెడలు వంచి అమలు చేయిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి మాట్లాడుతూ కూటమి అధికారం చేపట్టిన ఈ ఏడాదిన్నర కాలంలో ప్రజలకు ఒరిగింది లేమీదన్నారు. వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో రైతులకు ఆదరణ కరువైందన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి రైతులను అదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వర బాబు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోని 2019 నుంచి 2024 వరకు రైతులకు స్వర్ణ యుగం అన్నారు. ప్రతి గ్రామాల్లోను ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు రైతులకు ఖరీఫ్ సీజన్‌కు ముందే అందుబాటు ఉంచారని గుర్తు చేశారు. జిల్లా అధికార ప్రతినిధి వీరన్న మాట్లాడుతూ యూరియా కోసం రైతులు పోరాటాలు చేసే దుస్థితి నెలకొందన్నారు. అనంతరం ఏఓ నాగభూషణంకు వైవీఆర్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, పార్టీ పట్టణ, రూరల్ కన్వీనర్లు ఎండీఆర్ ఖలీల్, బీ.రాము, నియోజకవర్గ రైతు సంఘం కన్వీనర్ ఆర్.బాబురావు, మున్సిపల్ మాజీ చైర్మన్ జింకల రామాంజనేయులు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ రంగనాయకులు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్, గుత్తి మున్సిపల్ వైస్ చెర్‌పర్సన్ వరలక్ష్మి, గుత్తి పట్టణ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు పీరా, సుభాష్‌రెడ్డి, గురుయాదవ్, శివ, ఫరూక్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు ఎన్.భీమలింగప్ప, పి.చెన్నకేశవరెడ్డి పామిడి పట్టణ, రూరల్ కన్వీనర్లు ఈశ్వర్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు సాకే ఓబులేసు, రామకృష్ణనాయక్, కౌన్సిలర్లు లింగన్న, నీలవతి, కుమారి,ఎస్టీ సెల్ జిల్లా నాయకులు గోవింద్‌నాయక్, నాయకులు యుగంధర్‌రెడ్డి, జయరామిరెడ్డి, సోమిరెడ్డి, సుంకిరెడ్డి, బావన్న, విష్ణు, ఆనంద్, వంశీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ బైక్ ర్యాలీ

అన్నదాత పోరుబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం గుంతకల్లులో బైక్ ర్యాలీ భారీగా చేపట్టారు. యోజకవర్గంలోని రైతన్నలు, వైఎస్సార్‌సీపీ కార్యక్తలు, నాయకులు వేలాది మంది స్వచ్ఛందంగా తరలివచ్చారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ క్యాంపు కార్యాలయం వద్ద వై.వెంకటరామిరెడ్డి జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి బైక్ నడిపి అందరిలోని జోష్ నింపారు. బైక్ ర్యాలీ పొట్టి శ్రీరాములు సర్కిల్, మున్సిపల్ కార్యాలయం నుంచి వైఎస్సార్ సర్కిల్ చేరుకోగా అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్, సంతా మార్కెట్, సత్యనారయణపేట మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకూ బైక్‌ర్యాలీ కొనసాగింది. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని ' యూరియా దొంగలు..కూటమి దొంగలు, రైతుల పట్ల కూటమి ప్రభుత్వ నిర్లక్ష వైఖరి నశించాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ధర్నా అనంతరం అన్నదాత పోరుబాట విజయవంతం చేసిన రైతులు, కార్యకర్తలకు, నాయకులకు వైవీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న నైరుతిరెడ్డి

'అన్నదాత పోరు'కు తరలిన నాయకులు

యల్లనూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జిల్లా కేంద్రంలో మంగళవారం తలపెట్టిన అన్నదాత పోరుకు యల్లనూరు మండలం నుంచి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి , మండల కన్వీనర్ శివశంకర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. అన్నదాతలకు ఎరువులు, యూరియా సరఫరా చేయకుండా ప్రభుత్వ మొండి వైఖరిపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ నాయకత్వంలో అన్నదాత పోరులో పాల్గొన్నారు.

పుట్లూరు: అనంతపురంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అన్నదాత పోరు'కు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీరుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు రైతులు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు.

బుక్కరాయసముద్రం: జిల్లా కేంద్రం అనంతపురంలో జరిగే రైతు పోరు కార్యక్రమానికి బుక్కరాయసముద్రం మండలం నుంచి భారీగా వైఎస్సార్ సీపీ నేతలు తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, నాయకులు ద్విచక్ర వాహనాలు, కార్లలో గ్రామాల నుంచి భారీగా తరిలారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన రైతు పోరు కార్యక్రమాల్లో పాల్గొని నిరసన తెలిపారు.



పుట్లూరు: 'అన్నదాత పోరు'లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వరరెడ్డి, నాయకులు



బుక్కరాయసముద్రం: 'అన్నదాత పోరు'లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు

నిర్బంధాలకు జగన్ సైన్యం భయపడదు

గార్లదిన్నె: పోలీసుల నిర్బంధాలకు జగన్ సైన్యం భయపడదని వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ శైలజానాథ్, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం అనంతపురంలో వైఎస్సార్ సీపీ పార్టీ అధ్వర్యంలో రైతాంగ సమస్యలు పరిష్కారించాలని, అన్నదాతకు అండగా చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి శింగనమల నియోజక వర్గంలో గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయ సముద్రం, నార్పల ,పుట్లూరు, యల్లనూరు మండలాలతోపాటు తాడిపత్రి నియోజక వర్గంలోని తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘం నాయ కులు, అభిమానులు, రైతులు వాహనాల్లో భారీగా తరలి వచ్చి, అనంతపురంలో కదం తొక్కారు. అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద వేలాది మంది పార్టీ శ్రేణులు నూతనోత్సవంతో ఆర్డీఓ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి, కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాకే శైలజానాథ్, కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు మెడలు వంచి రైతు సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించామన్నారు. రైతులందరికి యూరియా సక్రమంగా సరఫరా చేయాలన్నారు. అన్నదాత పోరుతో ప్రభుత్వానికి కనువిప్పు కలగాలన్నారు. గత ఏడాది అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఇప్పటికీ నయా పైసా ఇవ్వలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తోనే రైతు సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి, పార్ల మెంట్ రాష్ట్ర కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, రఘునాథ్ రెడ్డి, డీసీఎస్ మాజీ చైర్మన్ శ్రీరామిరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఫణీంద్ర, మాజీ సమన్వయకర్త వీరాంజనేయులు, బుక్కరాయ సముద్రం జెడ్పీటీసీ భాస్కర్, శింగనమల నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు పుల్లారెడ్డి, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఆంజనేయులు, గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయ సముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండల కన్వీనర్లు ఎల్లారెడ్డి, ప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, ఖాదర్ వలి, మహేశ్వర్ రెడ్డి, యల్లనూరు మండల కన్వీనర్ శివశంకర్, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



అనంతపురంలో అన్నదాత పోరు కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి సాకే శైలజానాథ్, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఇతర జిల్లా నేతలు

విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు మంగళవారం అనంతపురంలో వైఎస్సార్‌సీపీ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతం చేసినందుకు శింగనమల నియోజకవర్గం సమన్వయకర్త సాకే శైలజానాథ్ ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

చేనేతలకిచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న నేతకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతా పురుషోత్తం

పెద్దపప్పూరు: చేనేత కార్మికులకు ఏడాదికి రూ.25వేలు ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి ఏడాదిన్నర అవుతున్నా నెరవేర్చలేదని జిల్లా నేత కార్మికార్మిక సంఘం ఉపాధ్యక్షుడు చింతా పురుషోత్తం మండిపడ్డారు. మంగళవారం నరసాపురంలో నేత కార్మికులతో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బుధవారం అనంతపురానికి విచ్చేసే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని బహిరంగ సభలో నేతన్న భరోసా ఎప్పుడు నెరవేరుస్తాడన్న విషయాన్ని వెల్లడించాలని, లేకుంటే త్వరలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేత కార్మిక సంఘం నాయకులు రఘు, నీలూరు నారాయణస్వామి, తలారి లక్ష్మయ్య పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లికి చెందిన సుంకన్న అనే వృద్ధుడు మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుంకన్న గత కొన్ని నెలలుగా తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. పలు ఆస్పత్రులలో చికిత్స చేయించుకున్నప్పటికీ కడుపు నొప్పి తగ్గలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెట్రోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబసభ్యులు గుత్తి ప్రభుత్వాసపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెత్తను సంపద కేంద్రానికి తరలించాలి



మాట్లాడుతున్న ఈఓఆర్‌డీ సురేష్

సాక్షి ఎఫెక్ట్..

పెద్దపప్పూరు: ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను సంపద కేంద్రానికి తరలించాలని ఈఓఆర్‌డీ సురేష్ పారిశుధ్య కార్మికులకు సూచించారు. ఈనెల 8న సేకరించిన చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేసి కాల్చివేస్తురని సాక్షిలో 'వాహనాలున్నా..ఉపయోగం సున్నా' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఈఓఆర్‌డీ మంగళవారం చీమలవాగుపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. సేకరించిన చెత్తను సంపద కేంద్రానికి తరలించి వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. వర్మి కంపోస్టు విక్రయించి వచ్చే ఆదాయంతో పంచాయతీని అభివృద్ధి బాటలో నడిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి, ఇద్దరు పిల్లల అదృశ్యం



అదృశ్యమైన ఉమాదేవి, పిల్లలు (ఫైల్)

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఇద్దరు పిల్లలతో కలిసి మహిళ అదృశ్యమైంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. మోదీనాబాద్‌కు చెందిన ఉమాదేవి సోమవారం ఉదయం భర్త చిన్న రంగస్వామితో గొడవ పడింది. అనంతరం పిల్లలు తనుశ్రీ, ఆదిత్యతో కలసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న ఉమాదేవి తల్లి వెంకటలక్ష్మి చుట్టుపక్కల గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం రాత్రి ఆమె వన్‌టౌన్ పోలీసులను కలిసి ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశామని సీఐ మనోహర్ తెలిపారు.

దూదేకుల డైరెక్టర్ పదవిని ముస్లింకు ఎలా ఇస్తారు?



మాట్లాడుతున్న దూదేకుల సంఘం నాయకులు

గుత్తి: ఏపీ దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని బేతాపల్లి ముస్లిం సామాజిక వర్గానికి చెందిన బర్దివలికి ఇవ్వడంపై దూదేకుల కులస్తులు మండిపడ్డారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో మంగళవారం దూదేకుల(నూర్‌బాషా) సంఘం నాయకులు సమావేశమయ్యారు. జిల్లా అధ్యక్షులు వరిగడ్డి షాషావలి, మండల అధ్యక్షులు చాంద్ బాషా, ఉపాధ్యక్షులు కుళ్లాయి, సెక్రటరీ మాబు, జాయింట్ సెక్రటరీ మీరా మోదిన్ మాట్లాడారు. ఏపీ దూదేకుల కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా దూదేకుల కులస్తుల కోసం ఏర్పాటు చేశారన్నారు. అలాంటపుడు డైరెక్టర్ పదవిని దూదేకులు కులస్తులకు కాకుండా ముస్లిం సామాజిక వర్గానికి చెందిన బర్దివలికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. బర్దివలికి డైరెక్టర్ పదవిని రద్దు చేసి దూదేకుల కులస్తులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కార్పొరేట్ సెలూన్లను మూసివేయించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణులు, కుల, ప్రజాసంఘాల నేతలు

గుంతకల్లుటౌన్: నాయీ బ్రాహ్మణుల పొట్టకొడుతున్న కార్పొరేట్ సెలూన్ దుకాణాలను మూసివేయించాలని నాయీ బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, క్షౌ రవృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పట్టణంలో కార్పొరేట్ సెలూన్ షాపుల ఏర్పాటును వ్యతిరేకిస్తూ నాయీబ్రాహ్మణులు సెలూన్ షాపుల బంద్ పాటించారు. కార్పొరేట్ గోబ్యాక్ నినాదంతో మస్తానయ్య దర్గా నుంచి మార్కెట్ వరకూ ర్యాలీ చేశారు. మార్కెట్‌రోడ్డులో ఇటీవల ఏర్పాటు చేసిన ఓ కార్పొరేట్ సెలూన్‌షాపు ఎదుట రోడ్డుపై అరగంటపాటు బైఠాయించి నిరసన తెలిపారు. నాయీ బ్రాహ్మణులు చేపట్టిన కార్యక్రమానికి రజక, వాల్మీకి, ఎమ్మార్పీఎస్, సంచార జాతులు, దళిత, ప్రజా సంఘాల నేతలు పాల్గొని మద్దతు తెలిపారు. వివిధ మతాలు, కులాలకు చెందిన బడాబాబులు కార్పొరేట్ సెలూన్లు ఏర్పాటు చేసి నాయీ బ్రాహ్మణుల జీవితాలతో చెలగామాడొద్దని వారు హెచ్చరించారు. కార్పొరేట్ సెలూన్‌షాపులకు మున్సిపాలిటీ అనుమతివ్వరాదని, నాయీ బ్రాహ్మణ కులస్థుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం సహకారమందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం కార్యదర్శి వేణుగోపాల్, వివిధ కుల సంఘాల నేతలు మాచర్ల ఎల్లప్ప, దేవేంద్రప్ప, స్వామిదాస్, వై.శ్రీనివాసులు, జగ్గిలి రమేష్, జన్నేమస్తాన్, ఆనంద్, సీఐటీయూ కార్యదర్శి నాగరాజు, ఐద్వా అధ్యక్షురాలు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం సర్పంచ్ అధికార దర్పం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కావేటిసముద్రం రైతులు

తాడిపత్రిటౌన్: యూరియా కోసం సర్పంచ్ అధికార దర్పం ప్రదర్శించడంతో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు ఇబ్బందులు పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెంకటరెడ్డిపల్లిలో వెంకటరెడ్డిపల్లి, కావేటి సముద్రం, సజ్జలదిన్నె గ్రామాల రైతులకు రోజుకు ఒక గ్రామం ప్రకారం యూరియా పంపిణీ చేస్తున్నారు. మంగళవారం కావేటి సముద్రం రైతులకు యూరియా పంపిణీ చేయాల్సి ఉంది. దీంతో రంగంలోకి దిగిన కావేటి సముద్రం సర్పంచ్, టీడీపీ నాయకుడు అంజనేయరెడ్డి 'యూరియా మా గ్రామానికి తీసుకువచ్చి రైతులకు పంపిణీ చేయాలి' అని వ్యవసాయశాఖ అధికారులపై హుకుం ప్రదర్శించారు. నిబంధనల ప్రకారం ఆర్ఎస్‌కే ఉన్నచోటే రైతులకు యూరియా పంపిణీ చేస్తామనడంతో ఆయన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో సర్పంచ్‌తో పాటు వ్యవసాయశాఖ, ఆర్ఎస్‌కే సిబ్బంది తాడిపత్రి పట్టణంలోని ఏడీఏ రవి వద్దకు పంచాయితీ తీసుకొచ్చారు. సర్పంచ్‌ను అధికారులు శాంతపరిచేపనిలో పడటంతో.. యూరియా కోసం వెంకటరెడ్డిపల్లి ఆర్‌బీకే వద్దకు వచ్చిన కావేటి సముద్రం రైతులకు అక్కడ ఆర్ఎస్‌కే తెరుచుకోక పోవడం, అధికారులు ఎవ్వరూ లేకపోవడంతో ఆగ్రహానికి లోనయ్యారు. దీంతో దాదాపు ఉదయం 11.30కు ఆర్ఎస్‌కే వద్ద రైతులకు వ్యవసాయాధికారులు యూరియా పంపిణీ చేయాల్సి వచ్చింది

'సీఎం జిల్లా పర్యటనకొస్తే.. స్కూళ్లకు సెలవివ్వడం దుర్మార్గం'

గుంతకల్లుటౌన్: ఈ నెల 10న సీఎం చంద్రబాబు జిల్లా కేంద్రంలో జరిగే సభకు వస్తున్న సందర్భంగా స్కూళ్లు, కాలేజీలకు సెలవిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశాలివ్వడం సిగ్గుచేటని వైఎస్సార్ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నక్కానారప్ప మండిపడ్డారు. విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడమే కాకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడటం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో విద్యాశాఖ అధికారులకు సూచించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి

గుంతకల్లుటౌన్: బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ప్రభుత్వ వైద్య విద్యను దూరం చేయాలనే కుట్రతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని 10 మెడికల్ కాలేజీలను ప్రవేట్‌పరం చేసేందుకు యత్నిస్తోందని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి గద్దల నాగభూషణం విమర్శించారు. మంగళవారం బీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల వైద్యులు కావాలన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల ఆశలు ఆవిరైపోనున్నాయన్నారు. ప్రభుత్వమే మెడికల్ కాలేజీల నిర్వహించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాసరాజు, నాయకులు వెంకటకొండయ్య, జామిని, నాగవేణి, పరుశరామ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల తనిఖీ

యల్లనూరు: యల్లనూరు, తిమ్మంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం నోడల్ అధికారి విష్ణుమూర్తి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు కీర్తన, శివసాయిని ఆదేశించారు. బయోమెడికల్, బయో వేస్ట్ గురించి సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మధుకుమార్, సూపర్‌వైజర్లు హాజీవలి, నూర్‌బీ, రాము, ఫార్మసిస్టు బాబూరావు, గుల్జార్‌బేగం, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గుత్తి: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన పూజిత అనే వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం విష రసాయనం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాపు చేపట్టారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో మంగళవారం బైక్ బోల్తాపడిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. గుంతకల్లుకు చెందిన శ్రీనివాసులు, గజేంద్ర బైక్‌లో గుత్తికి వస్తుండగా రోడ్డు అధ్వానంగా ఉండటంతో బోల్తా పడింది. ఘటనలో గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

పెద్దవడుగూరు: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఐఓ డాక్టర్ యుగంధర్ సూచించారు. మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు, పెద్దవడుగూరు గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యులు పుష్పలత, సునీత, శ్రీనివాసబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమల్లో కూటమి విఫలం

పుట్లూరు/బుక్కరాయసమదురం: సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి పెద్దయ్య మండిపడ్డారు. మంగళవారం పుట్లూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్-సూపర్ హిట్ అంటూ కూటమి ప్రభుత్వం అనంతపురంలో బహిరంగ సభ ఏర్పాటు చేయడం దారుణమన్నారు. సీపీఐ నాయకులు రా జు, బాలు, ఓబుళపతి, నడిపి నారాయణ పాల్గొన్నారు. అలాగే బుక్కరాయసముద్రం మండలంలోని గోవిందపల్లి పంచాయతీలోకి సచివాలయం ఎదుట సీపీఐ నాయకులు హామీలు నెరవేర్చాలంటూ ధర్నా నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, మండల కార్యదర్శి రామక్రిష్ణ, సహాయ కార్యదర్శి రామాంజినేయులు పాల్గొన్నారు.

దళితులకిచ్చిన భూములు కాపాడాలి

గార్లదిన్నె: దళితులకు ఇచ్చిన ప్రభుత్వ భూములు కాపాడాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు.మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం నాయకులు మాట్లాడారు. మండలంలోని పెనకచెర్ల రెవెన్యూ పొలంలో ముకుందాపురం గ్రామానికి చెందిన దళితులకు 1983లో 580-4 సర్వే నంబర్‌లో 5.40 ఎకరాల భూమికి డీ పట్టా మంజూరు చేసిందన్నారు.అయితే దళితులు కూలి పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లడంతో అదే గ్రామానికి చెందిన సూర్యచంద్రరెడ్డి అక్రమంగా దళితుల భూమిని రెవెన్యూ అధికారులచే తమ పేరు మీద ఆన్ లైన్‌లో నమోదు చేసుకున్నారన్నారు. అప్పటి నుంచి దళితులు తమ భూములు తమకే ఇవ్వాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేస్తే తహసీల్దార్ ఈరమ్మ, దళితులకే భూమి చెందుతుందని, ఎండార్స్ మెంట్ ఇచ్చాన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి భూ రికార్డులు పరిశీలనచేసి దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చెన్నారెడ్డి, బాధిత రైతులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మకు పూజలు

యాడికి: మండలంలోని రామరాజుపల్లిలో ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం బోనాల ఉత్సవం నిర్వహించారు. గ్రామస్తులు అందరూ కలిసి సుమారు రూ. 80 లక్షలతో నిర్మించిన రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని జూలై 28 ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆలయం ప్రారంభించిన 41 రోజులు పూర్తి అయిన సందర్భాన్ని పురష్కరించుకుని ఉదయం ఆరు గంటల నుంచి రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగళూరులో స్థిరపడిన స్థల దాతలు రవి కుమార్, సుధాకర్ బాబు, ప్రశాంత్ కుమార్, శ్రీహరి సోదరులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

ఏపీఎంఐడీ పీడీ ఆకస్మిక తనిఖీ

పామిడి: మండంలోని రామరాజుపల్లి గ్రామ రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం ఏపీఎంఐడీ పీడీ రఘునాథ్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా రైతులకు యూరియా పంపిణీని ఆయన పరిశీలించారు. సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి, ఏఓ విజయకుమార్ పాల్గొన్నారు.